మెదక్
నమస్తే తెలంగాణ
బుధవారం 26 ఫిబ్రవరి 2025
WEDNESDAY, FEBRUARY 26, 2025

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

అంత్యక్రియలో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

చేగుంట, ఫిబ్రవరి 25 : బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని మెదక్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. నార్సింగి మండలం జెప్తిశివనూర్‌లో బీఆర్ఎస్ నాయకుడు బాలమలయ్య మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మంగళవారం జెప్తిశివనూర్‌లో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నార్సింగి, చిన్న శంకరంపేట జడ్పీటీసీలు బాణపురం కృష్ణారెడ్డి, పట్లోరి రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలరాంబాబు ,వైస్ ఎంపీపీ దొబ్బల సుజాతతో పాటు పలువురు పాల్గొని పాడె మోశారు. బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు.

విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రిలేదీక్ష

రిలేదీక్షలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మనుమయ సంఘం సభ్యులు

నర్సాపూర్, ఫిబ్రవరి 25 : డంపింగ్‌యార్డును వ్యతిరేకిస్తూ నర్సాపూర్ పట్టణంలో చేపట్టిన రిలేనిరాహారదీక్ష మంగళవారం తొమ్మిదో రోజుకు చేరుకున్నది. నిరాహారదీక్షలో భాగంగా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మనుమయ సంఘం నాయకులు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్‌యార్డును రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని వెల్లడించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి కృపాచారి, పట్టణాధ్యక్షుడు నరేందర్‌చారి, సీనియర్ సభ్యులు అంజయ్యచారి, శ్రీరాములు చారి, సదానంద్ చారి, మురళీధర్ చారి, వెంకటేశ్‌చారి, మహేశ్‌చారి, అనిల్‌చారి, బ్రహ్మంచారి, లింగంచారి పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో యూరియా నిల్వలు

కౌడిపల్లి, ఫిబ్రవరి 25 : మండలంలో పూర్తిస్థాయిలో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, మండల కేంద్రంలోని శ్రీభాగ్యలక్ష్మి ఎరువుల దుకాణంలో అమ్మకాల కోసం మంగళవారం అనుమతులను ఇచ్చామని మండల వ్యవసాయ అధికారి స్వప్న తెలిపారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. భాగ్యలక్ష్మీలో పూర్తిస్థాయిలో నిల్వలున్నాయని అవసరం ఉన్నరైతులు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. కొరత రాకుండా ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన రేషన్ బియ్యం

వెల్దుర్తి, ఫిబ్రవరి 25 : మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణానికి చెందిన వ్యాపారి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 1.80 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకుని పోలీసులు పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. వెల్దుర్తి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కైలా స్ శ్రీనివాస్ ఇంట్లో కిరాణం దుకాణం నిర్వహిస్తుండడంతో పాటు వెల్దుర్తితో పాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజల నుంచి రేషన్ బియ్యం సేకరించి, కిరాణం దుకాణంతో పాటు ఇంట్లో నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. శ్రీనివాస్ ఇంట్లో అక్రమ రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం రావడంతో వెల్దుర్తి పోలీసులు సోమవారం సాయంత్రం తనిఖీ చేయగా, 1.80 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యం లభ్యమ య్యాయని, వాటిని స్వాధీనం చేసుకొని బియాన్ని ఆటోలో పోలీస్టేషన్‌కు తరలించామన్నారు. ఈ విషయమై పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా, మంగళవారం వెల్దుర్తికి వచ్చిన సివిల్ సప్లై ఎన్సై సాయి కుమార్ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండ గా శ్రీనివాస్ ఎన్నో ఏండ్లుగా అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్నాడని, తక్కువ ధరకు ప్రజల నుంచి కొనుగోలు చేసి అధిక ధరలకు రైస్‌మిల్లులకు, ఇటుకబట్టీ, నిర్మాణరంగ కార్మికులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు, హమాలీలకు అధిక ధరలకు విక్రయిస్తుంటాడని గ్రామస్తులు తెలి పారు.

వర్చువల్ ల్యాబ్‌తో ప్రయోగ అనుభవం సులభం

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 25 : వర్చువల్ ల్యాబ్ వల్ల సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రయోగ అనుభవాన్ని సులభంగా అందించగలరని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'సైన్స్ భావలు – ప్రయోగ అనుభూతి, భౌతిక శాస్త్ర బోధనలో వర్చువల్ ల్యాబ్, సిములేషన్స్' అనే అంశంపై ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ సౌజన్యంతో ఒక రోజు కార్యశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాధాకిషన్ మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాళాశాలలకు చెం దిన అధ్యాపకులు, మెదక్ జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల ధరలకు రెక్కలు

శివరాత్రి పండుగ సందర్భంగా పెరిగిన డిమాండ్

రామాయంపేటలో పండ్ల దుకాణాలు

రామాయంపేట, ఫిబ్రవరి 25 : శివరాత్రి పండుగ పుణ్యమా అని పండ్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నోరూరించే రుచులను ఆస్వాదించాలనుకునే పండ్ల ప్రియులు ధరలను చూసి వెనక్కి తగ్గుతున్నారు. రామాయంపేట పట్టణం జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో స్థానికులతో పాటు చుట్టుప్రక్కల ఉన్న మండలాల వాసులు పండ్ల కోసం వచ్చి తీసుకెళ్తుంటారు. ఆర్టీసీ బస్సులో వెళ్లే ప్రయాణికులు బస్సులను కాసేపు నిలిపి పండ్లను కొనుగోలు చేస్తుంటారు. శివరాత్రి పండుగ కోసం పండ్ల నిర్వాహకులు రోడ్లపై స్టాళ్లను ఏర్పాటు చేసి కొనుగోలుదారులు వచ్చేలా బుట్టిల్లో ఉంచి విక్రయాలు జరుపుతున్నారు. ఒక్క రామాయంపేట పట్టణంలోని 50 వివిధ రకాల పండ్ల స్టాళ్ల వరకు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. అన్ని కాలాల్లో అందుబాటులో ఉండే డజను అరటి పండ్లకు రూ. 80 పలుకుతున్నాయి. సంత్ర, యాపిల్ రూ.50 కాగా, ద్రాక్షా పండ్లు కిలో రూ.140 ధర పలుకుతున్నది. ఖర్బుజ, పుచ్చకాయల ధరలు కిలో రూ.100, రత్నపురి గడ్డగా పిలిచే మొరం గడ్డ, దోసపండు కిలో రూ.100 పలుకుతుంది. ధరలను చూసి సామాన్యులు పండ్ల జోలికి వెళ్లడా నికి జంకుతున్నారు. పండ్లను విక్రయాలు జరిపే నిర్వాహకులు పోటాపోటీగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. ధరలు ఆకాశాన్నంటడంతో ఈసారి సీజన్ అంతంత మాత్రమే ఉండేలా కనిపిస్తుందని పండ్ల వ్యాపారులు తెలిపారు.

ప్రయోగశాలను తరలించడాన్ని నిలిపివేయాలి

ఆటోలో నీటి ప్రయోగశాల సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 25 : జిల్లా కేంద్రంలోని జిల్లా నీటి పరీక్ష ప్రయోగశాలను జిల్లా కేంద్రం నుంచి తరలించడాన్ని తక్షణమే నిలిపివేయాలని బీఆర్ఎస్ మెదక్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు మంగళవార డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో గల పాతూర్ గ్రామానికి ఎందుకు తరలిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో అన్ని గ్రామాలకు అందుబాటులో ఉండాల్సిన ప్ర యోగశాలను తరలించడం వల్ల భూగర్భ జలాల పరిరక్షణ కోసం, తాగునీటి పరీక్ష చేయించుకోవడానికి చాలా ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. తక్షణమే తరలించడాన్ని నిలిపివేసి యథావిధిగా కొనసాగించాలని సంబంధిత అధికారి విజయభాస్కర్‌రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు.

భయాన్ని వీడి పరీక్షలకు సిద్ధం కావాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకట సుబ్బయ్య

కౌడిపల్లి, ఫిబ్రవరి 25 : విద్యార్థులు ఇష్టంతో చదువుతూ భయాన్ని వీడి పరీక్షలకు సిద్ధంగా ఉండాలని కౌడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట సుబ్బయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వార్షికోత్సవం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చాన్నారు. ఫస్టియర్‌లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతును అందజేశారు. లెక్చరర్లు మణికాంతం, గిరిధర్‌రావు, సురేందర్‌రెడ్డి, భాస్కర్, చంద్రం, శ్రీనువాస్, లత పాల్గొన్నారు.

వరిపైరును పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కొల్చారం, ఫిబ్రవరి 25 : మండల పరిధిలోని వెంకటాపూర్, అంసానిపల్లి గ్రామాల్లో మంగళవారం సంగుపేట ఏరువాక కేంద్రం, తోర్నాల వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు పర్యటించి, వరిపొలాలను పరిశీలించారు. యాసంగిలో వరిసాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం సమన్వయ కర్త శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ మాట్లాడారు. రోగ లక్షణాలను, నివారణ చర్యలను రైతులకు వివరించారు. తోర్నాల శాస్త్రవేత్త డాక్టర్ శ్రీజయ, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి వినయ్ కుమార్, కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి, మండల వ్యవసాయ అధికారి శ్వేతాకుమారి, ఏఈవో స్రవంతి, ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా సమయపాలన పాటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీడబ్ల్యూవో హైమావతి

నర్సాపూర్, ఫిబ్రవరి 25 : అంగన్‌వాడీ టీచర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డీడబ్ల్యూవో హైమావతి హెచ్చరించారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలో నర్సాపూర్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూవో హైమావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆటపాటల ప్రీస్కూల్ విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో హేమభార్గవి, వివిధ మండలాల సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఏడుపాయల జాతరపై పాట సీడీ ఆవిష్కరణ

ఏడుపాయల జాతరపై పాట సీడీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ/మెదక్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : మెదక్ అభివృద్ధి పోరాట సమితి అధ్యక్షుడు, కవి, రచయిత హర్కార్ మహిపాల్ ఏడుపాయల జాతరపై రచించిన పాట సీడీని కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన దుర్గామాత జాతరపై పాటను మెదక్ ప్రాంతానికి చెందిన వ్యక్తి రాసి విడుదల చేయడం అభినందనీయమన్నారు. అనంతరం రచయిత హర్కార్ మహిపాల్ మాట్లాడుతూ మెదక్ ప్రాంతానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందన్నారు. భవిష్యత్ తరాలకు మెదక్ చరిత్రను తెలుపేందుకు మరెన్నో కవితలు, రచనలు రాయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేశ్, మున్నూరు కాపు సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు బట్టి ఉదయ్, నాయకులు నల్లాల విజయ్, పూల మల్లేశ్, కానుగు రాము, రాజు తదితరులు ఉన్నారు.

జాతరను ఘనంగా నిర్వహించాలి

పాపన్నపేట, ఫిబ్రవరి 25 : ఏడుపాయల జాతరను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. మంగళవారం ఆయన ఏడుపాయలలో జాతర నిర్వహణపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు అదేశించారు.

భారీ బందోబస్తు

ఏడుపాయల జాతరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ముగ్గురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 61 మంది ఎస్సైలతో పాటు మహిళా పోలీసులతో మొత్తం 883 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి అడ్డువస్తే చర్యలు

గ్రంథాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి

రేగోడ్, ఫిబ్రవరి 25 : గ్రంథాలయ నిర్మాణ పనులకు అడ్డువస్తే ఎంతటి వారైనా చట్యరీత్యా చర్యలు తీసుకుంటామని మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ. 50 లక్షల నిధులు గ్రంథాలయానికి సమకూర్చినట్లు తెలిపారు. గ్రంథాలయం నిర్మాణ పనులు చేపడుతున్నప్పుడు ఎవరైనా అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రంథాలయ సిబ్బంది నరేందర్ రెడ్డి, శంకర్, యాదగిరి, లైబ్రేరియన్ సుజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుంగ్-ఫు టోర్నీలో రామాయంపేట విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ బృందం

రామాయంపేట, ఫిబ్రవరి 25 : కుంగ్–ఫు టోర్నీలో గెలుపొందిన రామాయంపేట విద్యార్థులకు వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ బృందం సభ్యులు సంగారెడ్డిలో బహుమతులు ప్రదానం చేశారు. రెండో ఓపెన్ నేషనల్ కుంగ్‌ఫు ఎస్‌బీఆర్‌కప్ 2025 టోర్నీని సంగారెడ్డిలోని వారియర్ మార్షల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో పలు విభాగాల్లో రామాయంపేట విద్యార్థులు పలు అవార్డులు అందుకున్నారు. శిక్షకులు సీనియర్ మాస్టర్ శ్రీనివాస్, ఎస్కే హైమద్ తదితరులు ఉన్నారు.

శివైక్యం పొందిన ఇద్దరు పండితులు

శివనూరి విశ్వనాథ శర్మ (ఫైల్)

శనిగల మురళీశర్మ (ఫైల్)

చేగుంట, ఫిబ్రవరి 25 : చేగుంటకు చెందిన పండితులు శివైక్యం పొందారు. మండలకేంద్రం చేగుంటకు చెందిన శివనూరి విశ్వనాథశర్మ (88)ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ గుండెపోటు రావడంతో దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందారు. జ్యోతిష్యంలో నిపుణులైన మురళీశర్మ (64) కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందాడు. చేగుంటకు చెందిన ఇద్దరు పండుతులు శివైక్యం పొందడంతో చేగుంటలో విషాధచాయలు అలుముకున్నాయి. మెదక్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు అయిత పరంజ్యోతితో పాటు పలువురు వారి అంత్యక్రియల్లో పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి

వెల్దుర్తి, ఫిబ్రవరి 25 : చెరువులో తీసిన కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అందుగులపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. వెల్దుర్తి పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అక్కమొల్ల గణేశ్ (40) సోమవారం ఉదయం పంట పొలానికి నీరు పారపెట్టి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయిన తిరిగి రాకపోవడంతో గణేశ్ భార్య, తమ్ముడు శ్రీను ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం పొలం సమీపంలో ఉన్న చెరువులోని కుంటలో పడి మృతిచెందినట్లు కుటుంబీకులు గుర్తించారు. గ్రామస్తుల సహకారంతో బయటకు తీశారు. గణేశ్ కాళ్లకు చేపల వల చుట్టుకొని ఉండడంతో అనుమానం వ్యక్తం చేశారు. గణేశ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీతాలు ఇవ్వకుంటే సమ్మెకు వెళ్తాం

రామాయంపేట, ఫిబ్రవరి 25 : జీతాలు ఇవ్వకుంటే మూగ జీవాలకు వైద్య సేవలు నిలిపివేస్తామని మొబైల్ టీమ్ వైద్య బృందం సభ్యులు తెలిపారు. రామాయంపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో మూగ జీవాలకు మంగళవారం వైద్యసేవలు అందించారు. 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజక వర్గంలో ఒకటి చొప్పున మూగజీవాల కోసం మొబైల్ వాహనం ఏర్పాటు చేసిన డాక్టర్, కెప్టెన్, హెల్పెర్‌తో నలుగురు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆరు నెలల నుంచి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు, ప్రభుత్వం స్పందించి జీతాలు ఇవ్వని యెడల వైద్య సేవలు నిలిపి వేసి, సమ్మెకు వెళ్తామని వారు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

కౌడిపల్లి, ఫిబ్రవరి 25 : రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కౌడిపల్లి పరిధిలో 765డీ జాతీయ రహదారిపై ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డితో కలిసి ప్రమాద స్థలాలను గుర్తించి అక్కడ నిరంతరంగా ఉండేందుకు పిక్స్‌బుల్ బోలార్డ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు.

చెరువులో పడి ఇద్దరు మృతి

నర్సాపూర్, ఫిబ్రవరి 25 : సరదాగా చెరువులో దిగి ప్రమాదవశాత్తు ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన నర్సాపూర్ పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మున్సిపాలిటీకి చెందిన సార ప్రవీణ్‌గౌడ్ (31) ఆన్‌లైన్ సంస్థలో విధులు నిర్వర్తించగా, దుర్గప్పగారి సునీల్ గౌడ్(30) కల్లు డిపోలో పనిచేస్తున్నాడు. మంగళవారం ఈ ఇద్దరు కలిసి నర్సాపూర్ పట్టణంలోని రాయారావు చెరువు వద్దకు వెళ్లి వారు తెచ్చుకున్న మద్యాన్ని సేవించి చెరువులోకి దిగగా, ప్రమాదవశాత్తు ఇద్దరు నీటిలో మునిగి మృతి చెందారు. ఇరువురి మృతితో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

మహాశివరాత్రికి శివాలయాలు ముస్తాబు


చిన్నశంకరంపేట : ముస్తాబైన సోమేశ్వర స్వామి దేవాలయం

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 25 : చిన్నశంకరంపేటలోని శ్రీ సోమేశ్వర దేవాలయం 54వ వార్షికోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. రుద్రారంలోని సంగమేశ్వరస్వామి 76వ బ్రహ్మోత్సవాలను బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

మెదక్‌లో..

మెదక్‌రూరల్, ఫిబ్రవరి 25 : మెదక్ మండల పరిధిలోని మాచవరం శివాలయం, రాజ్‌పల్లి శివాలయం, మంబోజిపల్లి కొయ్యగుట్ట మల్లన్న ఆలయాలు శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి.

నిజాంపేటలో..

నిజాంపేట, ఫిబ్రవరి 25 : మండలంలోని కల్వకుంటలో రాజ రాజేశ్వరస్వామి ఆలయాన్ని నిర్వాహకులు రంగు రంగుల బంతి పూలు, మామిడి తోరణాలతో ముస్తాబు చేశారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయంలో నేడు సామూహిక మహారుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణం, రథోత్సవ ఊరేగింపు, భజనలు, జాగరణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు డాక్టర్ శివకుమార్ స్వామి తెలిపారు.

చేగుంటలో..

చేగుంట, ఫిబ్రవరి 25 : మహా శివరాత్రి ఉత్సవాలకు చేగుంట మండల కేంద్రంతో పాటు ఉల్లితిమ్మాయిపల్లి, రాంపూర్ తదితర గ్రామాల్లోని శివాలయాలు మిద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. రాంపూర్‌లోని అగ్రహారం సంతాన సోమేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు.

కొల్చారం వీరభద్ర ఆలయంలో ..

కొల్చారం, ఫిబ్రవరి 25 : శివరాత్రి సందర్భంగా కొల్చారంలోని పురాతన వీరభద్ర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు ర్యాగళ్ల ఆనంద్, ఆలయ అర్చకులు మహేశ్వరప్ప మంగళవారం తెలిపారు. ఆసక్తి గల భక్తులు సతీసమేతంగా సామూహిక అభిషేకాల్లో పాల్గొనాలని సూచించారు.

పట్టభద్రుల గొంతుకనవుతా

సిద్దిపేట టౌన్,ఫిబ్రవరి 25 : పట్టభద్రుల సమస్యల సాధనకు శాసనమండలిలో గళం ఎత్తుతానని స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి, ప్రజా వకీల్ దేవునూరి రవీందర్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగలకు ఇచ్చిన హామీలు ఇచేవరకు ఉద్యమిస్తామన్నారు. పట్టభద్రులు చైతన్యంతో ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సాగర్, రాజలింగం, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులను ఓడించాలి

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్పొరేట్ శక్తులను ఓడించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డే అభ్యర్థులను ఓడించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు ఎమ్మెల్సీ ఎన్నిలక తర్వాత రేవంత్ రెడ్డికి పదవీ గండం ఉందన్నారు. పట్టభద్రుల తనను శాసమండలికి పంపించాలని కోరారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

నిజాంపేట, ఫిబ్రవరి 25: నిజాంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్,ఫిబ్రవరి25 : మండల పరిధిలోని నాగులపల్లి గ్రామపరిధిలోని ఎంపీపీఎస్ బంజారానగర్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు.

చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్,ఫిబ్రవరి 25 : మండల కేంద్రమైన చిలిపిచెడ్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయంపరిపాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు. హెచ్ఎం సర్వన్ నాయక్ పాల్గొన్నారు.

ఇంటర్, 'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 25 : జిల్లాలో ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ నగేశ్. ఇంటర్ నోడల్ అధికారి మాధవి, డీఈవో రాధాకిషన్ ఆర్టీసీ డీఎం సురేఖ తదితర అధికారులతో పరీక్షల ఏర్పట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు జిల్లాలో 68 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 10,387 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 30 కేంద్రాల్లో 14,224 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు.